
పండగకు పప్పన్నం తినలేం!

- రేషన్ దుకాణాలకు 60 శాతం మాత్రమే కందిపప్పు
- కార్డుదారులకు అరకొరగా పంపిణీ
- బయట మార్కెట్‌లో కిలో కంది పప్పు రూ.125



మార్కాపురం: పెద్ద పండగ సంక్రాంతికి పేద ప్రజలు పప్పన్నం తినలేని పరిస్థితి ఏర్పడింది.! రేషన్ వాహనాల ద్వారా ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డుదారులకు అందించే కందిపప్పు కోటాలో కోత విధించింది. చేయాల్సిన సరఫరాలో 60 శాతం మాత్రమే రేషన్ డీలర్లకు అందించింది. దీంతో వారు కూడా పూర్తిస్థాయిలో ఎవరికివ్వాలో అర్థంకాక.. ఇవ్వాలా.. వద్దా.. అన్న సందేహంలో తెలిసిన వారికి మాత్రమే గుట్టుచప్పుడు కాకుండా కందిపప్పు ఇవ్వాల్సిన పరిస్థితి దాపురించింది. బయట మార్కెట్‌లో కేజీ కందిప్పు 125 రూపాయలు ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కిలో 67 రూపాయలకు అందించే కందిపప్పు కోసం కార్డుదారులు ఎదురుచూస్తున్నారు. అయితే పౌర సరఫరాల శాఖ రేషన్ లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో కందిపప్పు అందించలేదు.

కందిపప్పు కేటాయింపు ఇలా..

మార్కాపురం పౌరసరఫరాల శాఖ గోడౌన్ పరిధిలో మార్కాపురం, తర్లుపాడు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాలు ఉన్నాయి. ప్రతి నెలా ఈ మండలాల్లోని రేషన్ షాపులతోపాటు దొనకొండలో 8 షాపులు, కొనకనమిట్లలో 6 షాపులు మొత్తం వెరసి 150 రేషన్ దుకాణాలకు 78 టన్నుల కందిపప్పు రావాల్సి ఉండగా 45 టన్నులు మాత్రమే సరఫరా చేశారు. పొదిలి పౌరసరఫరాల శాఖ గోడౌన్ పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల మండలాలకు గానూ 40 టన్నుల కందిపప్పుకుగాను 28 టన్నులు మాత్రమే సరఫరా అయింది. దీంతో రేషన్ డీలర్లు ఎలా పంపిణీ చేయాలో తెలియక తలపట్టుకుంటున్నారు.

సంక్రాంతి పండగ మరో వారంరోజుల్లో వస్తుండటంతో ప్రతి ఒక్కరూ పప్పన్నం తినాలనే ఆశతో తమకు చక్కెరతోపాటు కందిపప్పు కావాలని అడుగుతున్నారు. అయితే తగినంత సరఫరా లేకపోవడంతో ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డీలర్లు చేతులెత్తేస్తున్నారు.

సలసలా కాగుతున్న నూనె..

సంక్రాంతి పండగకు ప్రతి ఒక్కరూ అరిసెలు, చక్రాలు, పిండి వంటలు చేసుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో వ్యాపారులు నూనె ధరను అమాంతం పెంచారు. కంపెనీని బట్టి లీటరు నూనె రూ.130 నుంచి రూ.150 వరకూ విక్రయిస్తున్నారు. దీంతో ఈ ఏడాది సంక్రాంతి పండగకు పిండి వంటలు చేసుకుని తినడం కూడా కష్టమేనని పేదలు అభిప్రాయపడుతున్నారు. ధరలు తగ్గించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండటంతో నిత్యావసర వస్తువులు దీపావళి టపాసుల్లా ఆకాశాన్నంటుతున్నాయని విమర్శిస్తున్నారు.

మార్కాపురం నియోజకవర్గంలో కార్డుదారుల వివరాలు		
మండలం	రేషన్ షాపులు	తెల్లరేషన్ కార్డులు
మార్కాపురం	62	33,378
తర్లుపాడు	19	9,992
పొదిలి	37	18,650
కొనకనమిట్ల	30	14,971
మొత్తం	148	76,991

మాకూ కందిపప్పు ఇవ్వాలి



ఈ నెలలో సంక్రాంతి పండగ ఉన్నందున ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు కందిపప్పు ఇవ్వాలి. అలాగే సామాన్య ప్రజలకు కూడా కిలో కందిపప్పు ఇస్తే బాగుంటుంది. బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు 130 రూపాయల వరకు ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి అందరికీ కందిపప్పు ఇవ్వాలని కోరుతున్నాం.

– కె.కృష్ణారెడ్డి, మార్కాపురం

ఉన్నంత వరకు ఇస్తున్నాం

ప్రభుత్వం గోడౌన్‌లకు పంపించిన కందిపప్పును డీలర్లకు పంపించాం. ఉన్నంత వరకు కార్డుదారులందరికీ ఇవ్వాలని ఆదేశించాం. కందిపప్పు తీసుకెళ్లిన డీలర్లందరూ కార్డుదారులకు స్టాకు ఉన్నంతవరకూ కందిపప్పు ఇవ్వాల్సిందే.

– అర్జున్‌రెడ్డి, ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ, మార్కాపురం

పనే ప్రధానం.. ప్రాణాలకేదీ ప్రాధాన్యం?

- పొట్టకూటి కోసం ప్రమాదకర రీతిలో కూలీల రాకపోకలు
- పరిమితికి మించి ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా అదే తీరు
- తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా కానరాని మార్పు



చిన్నకంభం సమీపంలో ప్రమాదకర ప్రయాణం

కంభం: గ్రామీణ ప్రాంతాల నుంచి దూరప్రాంతాలకు కూలీ పనులకు వెళ్లేందుకు రైతు కూలీలు ఆటోలు, ట్రాక్టర్లలో పరిమితికి మించి ప్రయాణిస్తూ ప్రమాదాలతో చెలగాటమాడుతున్నారు. నలుగురు కూర్చోవాల్సిన ఆటోలో 10 నుంచి 15 మంది వరకు ఉంటున్నారు. ప్రయాణికుల ఆటో, లగేజీ వాహనాల్లో సుమారు 30 నుంచి 40 మంది వరకు కూర్చుంటుండగా, ట్రాక్టర్‌లో అయితే ఏకంగా 50 మందికి పైగా కూర్చొని 30–40 కిలోమీటర్ల దూరం కూలీ పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తున్నారు. దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలు గాల్లో కలిసిపోవాల్సిందే.

గ్రామీణ ప్రాంతాలకు పూర్తి స్థాయిలో బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఎక్కువగా ఆటోలను ఆశ్రయిస్తున్నారు. గడిచిన ఐదు నెలల్లో కంభం సర్కిల్ పరిధిలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 50 మందికి పైగా గాయాలపాలయ్యారు. ఆదివారం రాత్రి కూడా కంభం మండలంలోని యర్రబాలెం వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, 9 మందికి గాయాలయ్యాయి. రోజూ సాయంత్రం వాహనాలు తనిఖీ చేసి జరిమానా విధిస్తున్న పోలీసులు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రమాదాలకు కారణాలివే..

హైవే రోడ్లపై ప్రమాద సూచికలు లేకపోవడం, తరచూ మరమ్మతుల పేరిట చిప్స్, కంకర వంటివి రోడ్లపై వదిలేస్తుండటం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. హైవే రోడ్డుపై ఉన్న యూటర్న్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఈ ప్రాంతంలో వారానికి ఒక వాహనమైనా ప్రమాదానికి గురవుతోంది. వైజంక్షన్, చెన్నయ్యమటం, కంభం– జంగంగుంట్ల మధ్య హైవే రోడ్డు, యర్రబాలెం సమీపంలో ఎక్కువగా ప్రమాదాలు జరిగి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులు ఎక్కువగా మద్యం సేవించి వాహనాలు నడుపుతుండటం కూడా ప్రమాదాలకు ఒక కారణం. హైవేపై, బస్టాండ్ సమీపంలో మద్యం షాపులుండటంతో వారు అక్కడ మద్యం తాగి రాంగ్ రూట్లలో ప్రయాణిస్తూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. హైవే అధికారులు అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, లైటింగ్ ఏర్పాటు చేయాలని, ప్రమాదకర మలుపులు, బ్లాక్ స్పాట్ల వద్ద తగిన వాహనాల వేగాన్ని నిరోధించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అనంతపురం-అమరావతి హైవేపై ప్రయాణికులతో ప్రమాదకరంగా వెళ్తున్న ఆటో



రవాణా వాహనం టాప్‌పై కూర్చున్న ప్రయాణికులు



యర్రబాలెం మలుపు వద్ద కూలీలతో వెళ్తున్న ఆటో

మాజీ మంత్రి సురేష్, అన్నాతో వైఎస్సార్ సీపీ నేతల భేటీ



మాజీ మంత్రి సురేష్‌ను సన్మానిస్తున్న శ్రీకాంత్ రెడ్డి, ఉదయ్‌భాస్కర్



మాజీ ఎమ్మెల్యే అన్నాను సన్మానిస్తూ..

మార్కాపురం టౌన్: మున్సిపల్ శాఖ మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును జిల్లా వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కె.ఉదయ్‌భాస్కర్, జిల్లా యూత్ ప్రెసిడెంట్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఆదివారం మార్కాపురం పట్టణంలోని వారి నివాసాల్లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న నూతన కమిటీలపై చర్చించినట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉండండి

- వైఎస్సార్ సీపీ నేతలకు సజ్జల సూచన



సజ్జలను సన్మానిస్తున్న షంషేర్, బద్రీనాథ్

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి దిశానిర్దేశం చేశారు. సజ్జలను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్, ఏపీ ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మేడా బద్రీ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. వైఎస్సార్ సీపీని గ్రామ స్థాయిలో బలోపేతలం చేయాలని, కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించినట్లు వారు తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు చినారికట్ల విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: రాష్ట్ర స్థాయి వైద్య, విజ్ఞానిక ప్రదర్శనకు మండలంలోని చినారికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ ఎంపికైందని హెచ్‌ఎం బి.కోటిరెడ్డి తెలిపారు. ఒంగోలులో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు ఎం.నాగసాయి, బి.వీరేంద్ర రూపొందించిన మానవీయ కంచె(ఫెన్సింగ్ ఆఫ్ హ్యూమానిటీ) ప్రాజెక్ట్ ఎంపికైందని పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో అడవి పందులు, కోతులు, ఇతర జంతువులు ప్రవేశించకుండా విద్యుత్ కంచె వాడటం ప్రమాదకరమన్నారు. ఈ నేపథ్యంలో అటు అడవి జంతువులు, ఇటు మనుషులకు ప్రాణ హాని లేకుండా 9 వోల్టుల బ్యాటరీ, సోలార్ ప్యానల్ ఉపయోగించి ఫెన్సింగ్ రూపొందించినట్లు వివరించారు. జంతువులు కానీ, మనుషులు కానీ కంచెను తాకినప్పుడు చిన్న పాటి బజర్ మోగి, శరీరం జిల్ అంటుందని తద్వారా జంతువులు భయపడి పారిపోతాయన్నారు. రైతులు ఈ కంచె ఏర్పాటు చేసుకోవడం ద్వారా రాత్రి పూట పొలాలకు కాపలా వెళ్లకుండా ఉండవచ్చాన్నరు. పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఐజాక్ గైడ్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి డీఈఓ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా మెమొంటో, ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆదివారం ప్రత్యేకంగా అభినందించింది. విద్యార్థులకు ప్రోత్సాహకంగా తెలుగు ఉపాధ్యాయుడు రామారావు రూ.2 వేలు అందజేసి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు



ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ

పొదిలి రూరల్: వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం పొదిలి మండలంలోని ఈగలపాడులో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈగలపాడులో 365 గృహాలను సర్వే చేయగా 9 మందికి జ్వరం, కీళ్ల నొప్పులు ఉన్నట్లు తేలిందని చెప్పారు. జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించి ఒంగోలు జీజీహెచ్ ల్యాబ్‌కు పంపాలని, నీటి పరీక్షలు నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. దోమల వ్యాప్తిని నివారించడానికి ఫాగింగ్ చేయాలని సూచించారు. కార్యాక్రమంలో డీఎంఓ శ్రావణకుమార్, ఏఎంఓ పి.శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సుగుణకుమార్, చందలూరు పీహెచ్‌సీ డాక్టర్ బ్లెస్సీ, డాక్టర్ శ్రీనివాసరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ కె.కృష్ణ, ఎస్.బసవరెడ్డి, హెచ్‌వీ మెరీనా, ఏఎన్‌ఎంలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ



కళాశాల రోడ్డులో పూజలందుకుంటున్న పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరి పోలేరమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ సమీపంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే కళాశాల రోడ్డులోని పోలేరమ్మ తల్లి ఆలయంలో అర్చకుడు అమర్‌నాథ్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

మూడు టిప్పర్‌లు స్వాధీనం

దర్శి: అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్ లారీలకు దర్శి తహసీల్దార్ శ్రావణ్ కుమార్ రూ.30వేలు జరిమానా విధించారు. ఆదివారం మట్టి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వీఆర్వో ద్వారా తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేకుండా తరలిస్తున్న మట్టి టిప్పర్‌లను స్వాధీనం చేసుకున్నారు.

గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ



పూజల్లో పాల్గొన్న ఆండాళ్ గోష్ఠి మహిళా కమిటీ సభ్యులు, భక్తులు

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో కొలువై ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి అమ్మవారికి ఆదివారం మహిళా భక్తులు సారె సమర్పించారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి అమ్మవారికి దేవస్థాన కమిటీ సభ్యులు, ఆండాళ్ గోష్ఠి మహిళా కమిటీ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మేళతాళాల నడుమ అంగరంగ వైభవంగా సారె సమర్పించారు. ఆలయ అర్చకుడు అరుణ్‌కుమార్ భక్తులకు తీర్థగోష్ఠి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ టి వెంకటేశ్వర్లు, సెక్రటరీ నిట్టూరి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టిమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

శంఖారావానికి వెళ్లి వస్తూ బస్సు ప్రమాదం

- తర్లుపాడు వాసులు 9 మందికి స్వల్ప గాయాలు



బోల్తాపడిన బస్సు

తర్లుపాడు: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావానికి వెళ్లి వస్తూ కోటప్పకొండ వద్ద బస్సు ప్రమాదానికి గురవడంతో తర్లుపాడు మండలానికి చెందిన 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. మార్కాపురం పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సులో మండలానికి చెందిన తాడివారిపల్లి, నాయుడుపల్లి, తర్లుపాడు కు చెందిన 35 మంది ఆదివారం ఉదయం శంఖారావానికి బయలుదేరి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కోటప్పకొండ సమీపంలో ప్రయాణిస్తున్న బస్సు కట్టలు విరగడంతో రోడ్డుపై ఓ పక్కకు ఒరుగుతూ బస్సు చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు స్పృహ కోల్పోగా, 9 మంది స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో అంబులెన్స్ ద్వారా వినుకొండ చేరుకుని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకొని స్థానిక విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఏర్పాటు చేసిన మరో వాహనంలో ఇంటికి చేరుకున్నారు.

క్లుప్తంగా

హిందువులు ఐకమత్యంతో మెలగాలి



హైందవ శంఖారావానికి తరలివెళ్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

గిద్దలూరు రూరల్: హిందువులు ఐకమత్యంతో మెలగాలని ఆర్.ఎస్.ఎస్. ఖండ కార్యవాహ పంట శివమల్లారెడ్డి, బీజేపీ నేతల పిడతల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఆదివారం తెల్లవారుజామున తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందువుల అలసత్వం కారణంగా ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పిడతల సరస్వతి, విశ్వ హిందూ పరిషత్ నాయకులు బూజుమేకల రాజు, యర్రారెడ్డి, రామిరెడ్డి, కె.నరసింహులు, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావం సభకు ఆదివారం మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. బీజేపీ నేతలు కిలారి శ్రీనివాసరావు, కేవీఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో జై శ్రీరామ్ అంటూ హిందూ శంఖారావం సభకు బయలుదేరారు.



కొనకనమిట్ల నుంచి బస్సులో వెళ్తున్న ప్రజలు

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి



వీఆర్‌ఏ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న తహసీల్దార్

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ మదార్ వలి(55) అనారోగ్యం కారణంగా ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. వీఆర్‌ఏ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మదార్‌వలి అంత్యక్రియలకుగాను ప్రభుత్వం తరపున రూ.15 వేలు అందజేశారు. ఆర్ఐ భాస్కర్, వీఆర్‌ఓలు వై.పి.రంగయ్య, అరిగెల వెంకటరామయ్య, సిబ్బంది సంజీవ్ తదితరులు నివాళులర్పించారు.

15 మంది వాహనదారులకు జరిమానా



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై అహరోన్

మార్కాపురం: హెల్మెట్ వాడకంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గత రెండు రోజుల్లో సుమారు 50 మందికిపైగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని గుర్తించి జరిమానా వేశారు. ఆదివారం ట్రాఫిక్ ఎస్సై అహరోన్, టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్ రావు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేని 15 మందిపై జరిమానా విధించడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై అహరోన్ తెలిపారు.

పట్టణ ముత్తవల్లి సంఘం ఎన్నిక



సప్దర్ అలీబేగ్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ ముత్తవల్లిలా సంఘం అధ్యక్షుడిగా జామియా మజీద్ ముతవల్లి మీర్జా సప్దర్ అలీ బేగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆదివారం తెలిపారు. అలాగే కార్యదర్శిగా మదీనా మజీద్ ముత్తవల్లి షేక్ కరీముల్లా, సహాయ కార్యదర్శిగా ఆటో నగర్ మసీద్ ముత్తవల్లి షేక్ బాషా, అన్సార్ మజీద్ ముత్తవల్లి షేక్ బాషా, అన్సార్ మసీద్ ముత్తవల్లి మొహమ్మద్, ఉపాధ్యక్షులుగా ఇస్లాంపేట మక్కా మసీద్ ముత్తవల్లిలు షేక్ మున్నా, మహబూబ్ పీరా, కోశాధికారిగా ఇందిరమ్మ కాలనీ మసీద్ ముత్తవల్లి షేక్ షఫీ, గౌరవ అధ్యక్షుడిగా చిన్న మసీద్ ముత్తవల్లి అబ్దుల్ రజాక్, గౌరవ సలహాదారులుగా మీనా మసీద్, కౌసర్ మజీద్‌ల ముత్తవల్లిలు షేక్ షఫీ ఉల్లా, పల్నాటి రెహమాన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీని పట్టణంలోని ముస్లిం సోదరులు, మైనార్టీ నాయకులు, వివిధ మసీద్‌ల అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.